రాష్ట్రంలో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం





కీసరలో ఎన్నికల ప్రచారంలో మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్ జోన్ బృందం: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం, మూడోసారి కేసీఆర్ సీఎం అవ్వడం ఖాయమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కీసర, అంకిరెడ్డిపల్లి, చీర్యాల తదితర గ్రామాల్లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజల కోసం, రైతులు కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి గెలిపించాలని కోరారు. రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్లు, దళితబంధు, బీసీబంధు, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందించి అన్ని వర్గాల వారికి అండగా నిలిచామని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా కొనసాగాలంటే మరోసారి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ గెలుపొందాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్, బీజేపీ నేతల మాయమాటలు విని మోసపోవద్దని ప్రజలంతా బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలవాలన్నారు. కాంగ్రెస్ నేతలు వ్యవసాయానికి 3 గంటల కరెంటు చాలని, రైతుబంధు అవసరం లేదని చెబుతున్నారని, వారికి ఓట్లు వేస్తే మనమంతా ఆగమైపోతామన్నారు. తాము చేసిన పనులను ప్రజలకు తెలుపుతూ ఓట్లు అడుగుతున్నామన్నారు. గ్రామాలను పట్టణాలను అభివృద్ధి చేసుకున్నామని, భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేసుకోవాలంటే మేడ్చల్‌లో మరోసారి తనను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మంత్రి తనయుడు చామకూర భద్రారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ ఇందిరా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సర్పంచులు, నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి పెద్దపీట..

ముస్లింల అభివృద్ధికి తెలంగాణ సర్కారు పెద్దపీట వేసిందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. కీసరలోని శుభం గార్డెన్స్, ఘట్‌కేసర్‌లోని బంధన్ ఫంక్షన్ హాలులో ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లింల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం షాదీముబారక్, మైనార్టీ బంధు, రంజాన్ కిట్లు అందజేస్తోందన్నారు. మైనార్టీల అభ్యున్నతికి పాటుపడుతున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

జోరుగా ప్రచారం.. ప్రచారంలో మహిళలు

బీఆర్‌ఎస్ శ్రేణులు ఎన్నికల ప్రచారంలో వేగం పెంచారు. మహిళా నాయకులు సైతం ప్రచారంలో పెద్ద ఎత్తున పాల్గొంటూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. పోలింగ్ తేదీ దగ్గర పడటంతో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేపడుతున్నారు. మేడ్చల్ మండలంలోని గ్రామాల్లో జెడ్పీటీసీ శైలజ, ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి, మహిళా నాయకులు ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. పార్టీ శ్రేణులు ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు.



ఘట్‌కేసర్‌లో ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయాంజాల్‌లో శ్రీరేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మంత్రి చామకూర మల్లారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్‌తో పాటు పలు పార్టీల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ మహోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మేడ్చల్ మొదటి ఓటరు హంసమ్మ



మేడ్చల్: ఆరు లక్షల మంది మేడ్చల్ ఓటర్లలో మొదటి ఓటరుగా మేడ్చల్ మండలం శ్రీరంగవరం గ్రామానికి చెందిన హంసమ్మగా రికార్డుల్లో చేరింది. శ్రీరంగవరం గ్రామానికి చెందిన 71 ఏళ్ల హంసమ్మ మొదటి బూత్‌లో మొదటి ఓటర్‌గా నమోదయ్యారు. తనకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి వచ్చిన ప్రతి ఎన్నికల్లో తప్పకుండా ఓటు వేస్తున్నానని, నియోజకవర్గంలోని ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటు వినియోగించుకోవాలని హంసమ్మ అన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



అనురాగ్ యూనివర్సిటీ కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ, ఎన్‌ఎస్‌ఎస్ సెల్ యూనిట్-1 సహకారంతో 62వ జాతీయ ఫార్మసీ వీక్-2023 సందర్భంగా జూబ్లీహిల్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ క్యాంపస్‌లో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఫార్మసీ డీన్ వసుధ భక్షి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శరీరంలో కళ్లు అతి ప్రధానమైనవని, వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. 205 మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి కంటి పరీక్షలు చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ఫార్మసీ విభాగం కో ఆర్డినేటర్ బాబా శంకర్‌రావు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మేడ్చల్ ఓటర్లు 6,37,838

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గ ఓటర్లు ఆరు లక్షల మార్కు దాటారు. నియోజకవర్గంలో 280 పోలింగ్ స్టేషన్లు ఉండగా ఓటర్లు ఆరు లక్షల 37వేల 838 మంది ఉన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు ఈ నెల 10 వరకు ప్రకటించిన జాబితాలో 6,37,838 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 3,28,222 మంది పురుషులు, 3,09,568 మంది మహిళలు, 48మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. 2019 వరకు మేడ్చల్ నియోజకవర్గంలో 4,32,202 మంది ఓటర్లుండగా 2023 వరకు 6,37,838 మంది చేరారు. గత ఎన్నికలకు తాజా ఎన్నికలకు 2,05,366 మంది ఓటర్లు పెరిగారు.

గౌడవెల్లిని మున్సిపాలిటీలో విలీనం చేయాలని వినతి

మేడ్చల్: మేడ్చల్, గుండ్లపోచంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీల మధ్యలో మిగిలిన ఏకైక గ్రామాన్ని ఏదో ఒక మున్సిపాలిటీలో విలీనం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మున్సిపల్ కార్యదర్శి ఇతర అధికారులకు వినతి పత్రం సమర్పించారు. మూడు మున్సిపాలిటీల మధ్య ఉన్న గౌడవెల్లిని ఏదో ఒక మున్సిపాలిటీలో విలీనం చేయాలని లేదా పాత రెవెన్యూ గ్రామంగా పునరుద్ధరించాలని కోరారు.

ఆర్టీసీ కార్మికులకు ప్రగతి చక్రం పురస్కారాలు



సన్మాన గ్రహీతలతో అధికారులు

మేడ్చల్: అక్టోబర్ నెలలో ఉత్తమంగా విధులు నిర్వర్తించిన మేడ్చల్ డిపో ఆర్టీసీ కార్మికులకు యాజమాన్యం ప్రగతి చక్రం పురస్కారాలు అందజేసింది. డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎం సుధాకర్ సన్మానించారు. కార్మికులకు యాజమాన్యం తరఫున ప్రశంస పత్రాలు అందజేసి శాలువాలతో కార్మికులను ఆయన ఘనంగా సన్మానించి సేవలను కొనియాడారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, ఏఈ స్నేహలత, సూపరింటెండెంట్ సత్యనారాయణ అధికారులు పాల్గొన్నారు.

ఓటు విలువను అందరూ తెలుసుకోవాలి



బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలని ఉస్మానియా విద్యాలయం స్కాలర్ కిరణ్ అన్నారు. చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉస్మానియా విద్యాలయం స్కాలర్స్ విద్యార్థులకు ఓటు హక్కు, ఓటు విలువపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు పట్ల అవగాహన కలిగి ఉండాలని, సమాజ హితం కోరి సేవ చేసే వారిని ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రావణ్ కుమార్‌రెడ్డి, అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, బీ.శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాదసభ

మేడిపల్లి: పీర్జాదిగూడ కార్పొరేషన్ 23వ డివిజన్ సాయిహిల్స్ కాలనీలో శుక్రవారం కార్పొరేటర్ దొంతమళ్ల శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. కార్యక్రమనికి మేడ్చల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డి, మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ శివకుమార్ హాజరయ్యారు. బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, చేపట్టబోయే అభివృద్ధి పనులను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దర్గ దయాకర్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు యూపీ సీఎం రాక

సనత్‌నగర్: సనత్‌నగర్ బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డికి మద్దతుగా ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సనత్‌నగర్ నియోజకవర్గంలో శనివారం రోడ్ షో నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు రోడ్ షో కొనసాగనుంది. ఆర్పీరోడ్డు నుంచి రోడ్ షో మొదలై ఎంజీ రోడ్డులో ముగిస్తుందని బీజేపీ శ్రేణులు తెలిపారు. మహంకాళి పోలీస్‌స్టేషన్ సమీపంలో యోగి ఆదిత్యానాథ్ మాట్లాడతారని పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సరళిపై ఆరా



సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్ సమదాయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సరళిని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ గౌతమ్, ఎన్నికల సాధారణ అబ్జర్వర్ ఎస్.కె.జైన్‌తో కలిసి పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో ఎలాంటి పొరపాట్లు చేయవద్దని, ఓటు వేయడానికి వచ్చే ప్రతి ఓటరుకి గుర్తింపు కార్డు ఉండాలని అన్నారు. ఫారం 13ఏ, 13బి, 13సిలను సరిచూసుకోవాలని, పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ గురించి, రాజకీయ పార్టీలకు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ముందే సమాచారం ఇచ్చామని, ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ప్రతి ఉద్యోగి తన విలువైన ఓటును వినియోగించాలని, ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని, పోస్టల్ బ్యాలెట్ల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి వీలుగా ఆయా నియోజకవర్గాలకు చెందిన ఫెలిటిటేషన్ కేంద్రాలు ఇక్కడ ఏర్పాటు చేశామని, సిబ్బంది విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ల నోడల్ అధికారి వంశీ మోహన్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తయిన సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా రిజర్వ్‌లో ఉన్న బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ కట్టుదిట్టంగా పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో 47 రిజర్వ్ బ్యాలెట్ యూనిట్లు, 155 కంట్రోల్ యూనిట్లు, 20 వీవీపాట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆయన చేపట్టారు. ఇప్పటికే అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎంల తరలింపు పూర్తయ్యిందని తెలిపారు. పోలింగ్ సందర్భంగా సాంకేతిక సమస్యలు తలెత్తినా ఓటింగ్‌కు అంతరాయం ఏర్పడకూడదనే అదనపు బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లను కేటాయిస్తున్నట్లు చెప్పారు.

యాంటీ బయోటిక్స్ మోతాదు మించితే ప్రమాదం

గాంధీఆస్పత్రి: యాంటీ బయోటిక్స్ మందులు మోతాదుకు మించి వినియోగిస్తే మానవ మనుగడకు ప్రమాదం వాటిల్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. హాస్పిటల్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీ (హెచ్ఐసీసీ) ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో ప్రపంచ యాంటీ మైక్రోబయోల్ రెసిస్టెన్స్ అవగాహన కార్యక్రమాలు, చైతన్యర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న డీఎంఈ రమేష్ రెడ్డి, సూపరింటెండెంట్ రాజారావు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. యాంటీ బయోటిక్స్‌ను అధికంగా వినియోగించడంతో మానవ శరీరం డ్రగ్ రెసిస్టెన్స్‌కు అలవాటు పడి కొన్నాళ్ల తర్వాత పని చేయదని, రోగ నిరోధకశక్తి తగ్గిపోవడం, యాంటీ బయోటిక్స్ పనిచేయక ప్రపంచవ్యాప్తంగా మానవాళి మనుగడ కష్టంగా మారుతుందని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌తో పాటు పలు ఆరోగ్య సంస్థలు హెచ్చరించినట్లు వివరించారు. ఆర్ఎంపీలు, మెడికల్ షాపులు ఇచ్చే యాంటీ బయోటిక్స్ ఎక్కువగా వాడొద్దని, గుర్తింపు పొందిన వైద్యుల సలహా మేరకే వినియోగించాలని సూచించారు. ఆర్ఎంఓ-1 జయకృష్ణ, మైక్రోబయోలజీ హెచ్ఓడీ జ్యోతిలక్ష్మీ, ఇన్ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్ అర్చన, ఎల్ఆర్ఎంఓ పద్మ, నర్సులు సునీత, జెస్సీమోల్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్‌ఎస్



ఇంటింటికీ ప్రచారంలో పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: మేడ్చల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పీర్జాదిగూడలోని పలు డివిజన్లలో శుక్రవారం మేడ్చల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి విజయం కోసం పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్‌కే అధికారం

- అవినీతి మల్లారెడ్డిని తరమికొట్టాలి
- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్
- జవహర్‌నగర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భారీ చేరికలు



మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న యాద్గార్‌పల్లి నాయకులు

శామీర్‌పేట్: అవినీతి మల్లారెడ్డిని మేడ్చల్ నుంచి తరిమి కొట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్కా ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం, జవహర్‌నగర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్లారెడ్డి ఒక ల్యాండ్ మాఫియా డాన్ అని, మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ మల్లారెడ్డి రూ.కోట్లకు పడగలెత్తాడని ఆరోపించాడు. ప్రజల ఆశీర్వాదంతో మేడ్చల్‌తో పాటు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, వచ్చిన వెంటనే అన్ని కులసంఘాలకు భవనాలతో పాటు సంక్షేమ నిధులను కేటాయిస్తామని వివరించారు.

భారీగా చేరిన ముదిరాజ్ సంఘం నాయకులు..

జవహర్‌నగర్ పరిధిలోని ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సోమ నర్సింగ్‌రావు ముదిరాజ్ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని ముదిరాజ్ కమిటీల సభ్యులు, నాయకులు సుమారు 250 మంది నక్క ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కీసరం మండలం, యాద్గార్‌పల్లి గ్రామ ఉపసర్పంచ్‌తో పాటు ముగ్గురు వార్డు సభ్యులు మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

పోచారం మున్సిపాలిటీలో..

మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలు, ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంస్కృతి టౌన్‌షిప్‌లో సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఓటర్లను కలిసి హస్తం గుర్తుకే ఓటు వేయాలని కోరారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనతో టౌన్‌షిప్‌వాసులకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే టౌన్‌షిప్‌లో అన్ని రకాల ఆధునిక వసతులు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వజ్రేష్ యాదవ్ హామీ ఇచ్చినట్లు చెప్పారు.

ఘట్‌కేసర్ మండలంలో..

కాంగ్రెస్ మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను గెలిపించాలని కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, మైనారిటీ నేతలు రహీంతో కలిసి ఘట్‌కేసర్ పట్టణంలోని జామామజీద్ వద్ద శుక్రవారం ప్రచారం చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి హస్తం గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.



నక్క ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరుతున్న జవహర్‌నగర్ ముదిరాజ్ సంఘం సభ్యులు



పీర్జాదిగూడలో మాట్లాడుతున్న మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్‌యాదవ్ తదితరులు